www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 10 | బుధవారం | 07 - 05 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజిలు : 8 | వెల : 4

## అక్రమాలపై ఉక్కుపాదం




3

### రాజస్థాన్ భూభాగంలో భారీస్థాయి

## యుద్ధ విన్యాసాలకు సర్వం సిద్ధం

**దేశవ్యాప్తంగా విన్యాసాల వేళ సరిహద్దు విమానాశ్రయాల నుంచి రాకపోకలు బంద్**

తొలిఅడుగు, ఇంటర్నెట్ డెస్క్: భారత వాయుసేన వార్ గేమ్స్ చేపడుతోంది. పాకిస్థాన్‌తో ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రాజస్థాన్ భూభాగంలో భారీస్థాయి యుద్ధ విన్యాసాలు నిర్వహించడానికి సిద్ధమైంది. అదే సమయంలో దేశవ్యాప్తంగా పౌరుల భద్రత, సంక్షోభ సమయాల్లో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్స్ కూడా జరుగుతున్నాయి. వాయుసేన వర్గాల సమాచారం ప్రకారం ఈ విన్యాసాలు

2



### శాంతి లేదా విధ్వంసం,

## భారత్ నిర్ణయించుకోవాలి

**భారత్‌తో శాంతి చర్చలకు పాకిస్థాన్ సుముఖంగా ఉందన్న బిలావల్ భుట్టో**

తొలిఅడుగు, న్యూఢిల్లీ : పహల్గామ్ ఉగ్రదాడి, అనంతరం సింధూ జలాల ఒప్పందంపై భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాల నేపథ్యంలో పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) ఛైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో శాంతి చర్చలకు తమ దేశం సిద్ధంగా ఉందని ప్రకటిస్తూనే, విధ్వంసం లేదా శాంతిలో ఏదో ఒకటి తేల్చుకోవాల్సిందిగా భారత్‌కు అల్టిమేటం జారీ చేశారు. పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీలో

2





### ఇకపై భారతీయులకే

## దక్కుతాయి

తొలిఅడుగు, న్యూఢిల్లీ :పాకిస్తాన్‌తో దశాబ్దాల నాటి సింధు జల ఒప్పందాన్ని రద్దు చేయాలని భారతదేశం తీసుకున్న నిర్ణయం తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం(మే 06) తన తొలి బహిరంగ వ్యాఖ్యలు చేశారు. భారతదేశానికి

2

# నన్ను కోసినా పైసా రాదు

- నన్ను కోసినా పైసా ఎక్కవ రాదు.. సీఎం రేవంత్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్
- ఉన్న ఆదాయానికి మించి ఉద్యోగులకు పైసా ఇవ్వలేను
- ఆర్థిక వ్యవస్థను నాశనం చేసినోడు ఫాంహౌసలో..

ఉద్యోగ సంఘాలు సమరం చేస్తామని ప్రకటించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరిపై, ఎందుకు సమరం చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టే బాధ్యత ఉద్యోగులకు లేదా అని ప్రశ్నించారు.




తొలిఅడుగు, హైదరాబాద్ : ఉద్యోగ సంఘాలు సమరం చేస్తామని ప్రకటించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరిపై, ఎందుకు సమరం చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టే బాధ్యత ఉద్యోగులకు లేదా? అని ప్రశ్నించారు. ఆర్థిక పరిస్థితి కుదురుకుంటున్న తరుణంలో కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుందని హెచ్చరించారు. తనను నిలువునా కోసినా వస్తున్న ఆదాయానికి మించి తానేమీ చేయలేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం అంటే తాము మాత్రమే కాదని, ఉద్యోగులు కూడా అందులో భాగమేనని

2

### జర్మనీలో కదం

## తొక్కిన భారతీయులు




**- జర్మనీలోని 700 మంది భారతీయులు శాంతియుత నిరసన**

తొలిఅడుగు, డెస్క్ : ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయినందుకు ప్రపంచవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. జర్మనీలోని సెంట్రల్ మ్యూనిచ్‌లో దాదాపు 700 మంది భారతీయ సమాజం సభ్యులు శాంతియుతంగా నిరసన తెలిపారు.

2



### సైరన్ మోగుతుంది..

## బీ అలర్ట్..

తొలిఅడుగు, న్యూఢిల్లీ : భారత్–పాక్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ భారత్ చేపడుతున్న చర్యలతో పాక్ వణికిపోతోంది. ఏ క్షణమైన తమపైన భారత్ దాడి చేస్తుందని తీవ్రంగా భయపడుతోంది. అంతర్జాతీయంగా ఏకాకిగా

2

### హైదరాబాద్‌లో మిస్

## వరల్డ్ పోటీల సందడి



తొలిఅడుగు, హైదరాబాద్ : మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ రెడీ అయింది. ప్రపంచ సుందరీమణులు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రభుత్వం సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకుతోంది. అటు.. మిస్ వరల్డ్ పోటీలపై అధికార, విపక్షాల మధ్య మాటలయుద్ధం కాక రేపుతోంది. ఈ క్రమంలో.. మంత్రి జూపల్లి కృష్ణారావు విపక్షాల విమర్శలపై స్పందించారు. తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించేందుకే మిస్ వరల్డ్ పోటీలు.. అంటూ.. అందాల పోటీలపై విపక్షాల కామెంట్స్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్ ఇచ్చారు.

2



### హైదరాబాద్‌లో 4 ప్రాంతాల్లోనే

## మాక్‌డ్రిల్స్!

తొలిఅడుగు, హైదరాబాద్ : దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ నగరంలో బుధవారం కీలక భద్రతా విన్యాసాలు (మాక్ డ్రిల్స్) నిర్వహించనున్నారు. ఇటీవల జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పౌరులను, భద్రతా సిబ్బందిని సన్నద్ధం చేయడంలో భాగంగా ఈ

2

### భూసేకరణ తర్వాతే

## ట్రిపుల్‌ఆర్




**ఎంత త్వరగా పూర్తిచేస్తే అంత త్వరగా పనులు**

తొలిఅడుగు, హైదరాబాద్ : భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యాకే రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఉత్తర భాగం పనులకు మోక్షం లభిస్తుందని తాజాగా సీఎం రేవంత్‌రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రులకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేసినట్టు తెలుస్తున్నది. 162 కి.మీ. పొడవైన ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణ పనుల కోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)

2

### రాజస్థాన్ భూభాగంలో భారీస్థాయి

# యుద్ధ విన్యాసాలకు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సుమారు ఐదున్నర గంటల పాటు నిర్విరామంగా సాగే ఈ కసరత్తులో రఫేల్, సుఖోయ్-30, మిరాజ్ 2000 వంటి అత్యాధునిక, శక్తివంతమైన యుద్ధ విమానాలు పాల్గొననున్నాయి. ఈ విన్యాసాలకు సంబంధించి పైలట్లకు ముందస్తు సమాచారాన్ని (నోటీస్ టు ఎయిర్‌మెన్ - వాయుసేన ఇప్పటికే జారీ చేసింది. ఈ విన్యాసాల కారణంగా సరిహద్దు ప్రాంతాల్లోని విమానాశ్రయాల నుంచి విమానాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న ప్రస్తుత తరుణంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సూచనల మేరకు దేశవ్యాప్తంగా పౌర రక్షణ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. వైమానిక దాడులు, బాంబు దాడులు వంటి అత్యవసర, సంక్షోభ పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఎలా స్పందించాలి, తమ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలనే దానిపై అవగాహన కల్పించడమే ఈ డ్రిల్స్ ప్రధాన లక్ష్యం. ఇందుకోసం దేశవ్యాప్తంగా దాదాపు 300 ప్రాంతాలను ఎంపిక చేశారు. ఈ మాక్ డ్రిల్స్‌ను కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారు.

# శాంతి లేదా విధ్వంసం, భారత్ నిర్ణయించుకోవాలి

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ, బిలావల్ భుట్టో భారత్‌తో చర్చల అంశాన్ని ప్రస్తావించారు. "భారత్ శాంతి మార్గాన్ని కోరుకుంటే, బిగించిన పిడికిలితో కాకుండా స్నేహ హస్తంతో ముందుకు రావాలి. కల్పితాలు కాకుండా వాస్తవాలతో చర్చలకు రావాలి. పొరుగు దేశంగా వారితో కూర్చుని వాస్తవాలు మాట్లాడుకుందాం" అని ఆయన అన్నారు. అయితే, ఇదే సమయంలో, "ఒకవేళ అలా కాదనుకుంటే, పాకిస్థాన్ ప్రజలను ఎవరూ మోకరిల్లేలా చేయలేరని గుర్తుంచుకోవాలి. పాక్ ప్రజలు పోరాటానికి సిద్ధంగా ఉన్నారు. ఇది యుద్ధంపై మక్కువతో కాదు. స్వేచ్ఛపై ప్రేమతో మాత్రమే" అంటూ హెచ్చరిక ధోరణిలో వ్యాఖ్యానించారు. ఇటీవల సింధూ నదీ జలాల విషయంలో "నీరు పారకపోతే రక్తం పారుతుంది" అంటూ బిలావల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

- ఉగ్రవాదంపై అంగీకారం, గత చరిత్రగా అభివర్ణన

ఇటీవల పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్, ఉగ్రవాద సంస్థలకు పాక్ మద్దతు ఇచ్చిందని, ఆర్థిక సాయం అందించిందని చేసిన వ్యాఖ్యలతో బిలావల్ భుట్టో ఏకీభవించారు. ఉగ్రవాద సంస్థలతో పాకిస్థాన్‌కు గతంలో సంబంధాలున్నది నిజమేనని ఆయన అంగీకరించారు. అయితే, అది ఒక 'ముగిసిన అధ్యాయం' అని, తమ చరిత్రలో అదొక 'దురదృష్టకరమైన భాగం' అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉగ్రవాదం వల్ల పాకిస్థాన్ బాధితురాలిగా మారిందని, తాము ఉగ్రవాదాన్ని ఎన్నడూ ప్రోత్సహించలేదని ఆయన తెలిపారు.

# ఇకపై భారతీయులకే దక్కుతాయి



కేటాయించిన నీరు ఇప్పుడు దేశంలోనే ఉంటుందని, దానిని ఉపయోగిస్తామని ఆయన అన్నారు. ఒక ప్రముఖ న్యూస్ ఛానల్ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, "ఇంతకుముందు భారతదేశానికి చెందిన నీరు బయటకు పోయేది. ఇప్పుడు భారతదేశ నీరు భారతదేశానికి అనుకూలంగా ప్రవహిస్తుంది, భారతదేశానికి అనుకూలంగా ఉంటుంది. భారతదేశానికి మాత్రమే ఉపయోగపడుతుంది" అని ప్రధాని మోదీ అన్నారు. ప్రభుత్వం సింధు జల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన కొన్ని రోజుల తర్వాత ప్రధాని మోదీ ఈ ప్రకటన చేశారు. ఇది ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంలో 1960లో పాకిస్తాన్‌తో సంతకం చేసిన చారిత్రాత్మక జల భాగస్వామ్య ఒప్పందం. పహల్గామ్‌లో 26 మంది పౌరుల ప్రాణాలను బలిగొన్న ఘోరమైన ఉగ్రవాద దాడి తర్వాత సింధు నదీ జలాల ఒప్పందాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రద్దు చేశారు.

జాతీయ భద్రతపై ప్రభుత్వ అత్యున్నత నిర్ణయం తీసుకునే సంస్థ అయిన కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ ఈ ఒప్పందాన్ని నిలిపివేయాలనే నిర్ణయం తీసుకుంది. పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఆపే వరకు ఈ సస్పెన్షన్ అమలులో ఉంటుందని భారతీయ అధికారులు స్పష్టం చేశారు. ఈ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత భారతదేశం అధికారికంగా దాని అమలును అడ్డుకోవడం ఇదే మొదటిసారి. ఇది దాని దౌత్య వైఖరిలో గణనీయమైన మార్పు. నిరంతర ఉద్రిక్తతల కారణంగా సంవత్సరాలుగా సమీక్ష కోసం అప్పుడప్పుడు పిలుపులు వచ్చినప్పటికీ, ఈ ఒప్పందం ఇప్పటివరకు తాకలేదు. కఠినమైన నిర్ణయాలు తీసుకోవడంలో గత ప్రభుత్వాలు విముఖత చూపడాన్ని విమర్శిస్తూ, ప్రధానమంత్రి మోదీ మంగళవారం మాట్లాడుతూ, "ఒకప్పుడు ప్రజలు అవసరమైన చర్యలు తీసుకునే ముందు ప్రపంచం ఏమనుకుంటుందో ఆలోచించేవారు. తమకు ఓట్లు వస్తాయో లేదో, తమ సీటు సురక్షితంగా ఉంటుందో లేదో ఆలోచించేవారు. ఈ కారణాల వల్లే ప్రధాన సంస్కరణలు ఆలస్యం అయ్యాయి. ఏ దేశం కూడా ఇలా పురోగమించలేదు. మనం దేశాన్ని ముందు ఉంచినప్పుడే దేశం పురోగమిస్తుంది" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# నన్ను కోసినా పైసా రాదు..

మొదటిపేజీ తరువాయి

చెప్పారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన పోలీస్ సిబ్బందికి అవార్డులు అందించే కార్యక్రమం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు మొత్తం కలిస్తే కేవలం 2 శాతం మాత్రమే ఉన్నారని చెప్పారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి బాధ్యత ఈ రెండు శాతం మంది మీద ఉందన్నారు. ఉద్యోగ సంఘాలు ప్రకటించిన సమరం 98% ఉన్న రాష్ట్ర ప్రజలపైనా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. పదేళ్లల్లో ప్రభుత్వ ఉద్యోగి ఏనాడే 1న వేతనం తీసుకోలేదని రేవంత్ ప్రస్తావించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1.58 లక్షల కోట్లు అప్పు తెచ్చిందని, గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు రూ. 1.52 లక్షల కోట్లు కట్టామని వివరించారు. తెచ్చిన అప్పులోంచి ఒక్క రూపాయి కూడా ప్రజా సంక్షేమానికి గానీ, ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలకు గానీ వాడలేదని చెప్పారు. గత ప్రభుత్వం తెచ్చిన అప్పులకు సంబంధించి నెలకు రూ. 7 వేల కోట్లు అసలు, మిత్తి చెల్లిస్తున్నామని వివరించారు. ఉద్యోగుల పదవీ కాలం 58 ఏళ్లనుంచి మూడేళ్లు పెంచిపోయారని, రిటైర్మెంట్ బకాయిలు రూ.8,500 కోట్లు పెడింగ్ పెట్టి వెళ్లారని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పదహారు నెలల్లో రూ.30 వేల కోట్లు రైతుల ఖాతాలకు బదిలీ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం ఉచిత విద్యుత్ బకాయిలు వేల కోట్లు బాకీ పెట్టిందని చెప్పారు. బొగ్గు కొనుగోలు చేసి సింగరేణికి బకాయిలు పెట్టిందని వివరించారు. ప్రాజెక్టులకు సంబంధించే కాంట్రాక్టర్లకు రూ.50 వేల కోట్లు బకాయిలు పెట్టారని వివరించారు. ప్రభుత్వమై ఉండి 11% వడ్డీకి అప్పులు తెచ్చారని, ఇంత దుర్మార్గం దేశంలో ఎక్కడా ఉండదని వ్యాఖ్యానించారు. ఔటర్ రింగురోడ్డు, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్‌లో ఉన్న భూములన్నీ అమ్మేశారని ప్రస్తావించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఒక గుంట భూమి అమ్మలేదని స్పష్టం చేశారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములుగా, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సమరం అని ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవర్ని నిందించదలుచు కున్నారు? అన్నారు. ఉద్యోగులకు 35 ఏళ్లు జీతభత్యాలు, పదవీ విరమణ తర్వాత పెన్షన్లుఇచ్చేది ప్రజలేనని, వారి విషయంలో ఉద్యోగులకు బాధ్యత లేదా? అని సీఎం ప్రశ్నించారు.



# జర్మనీలో కదం తొక్కిన భారతీయులు

మొదటిపేజీ తరువాయి

ఈ నిరసన సమీపంలోని చారిత్రాత్మక గెష్విస్టర్-స్కోల్-ప్లాట్జ్ వద్ద ప్రారంభమై ముంచ్నర్ ఫ్రీహీట్ వద్ద ముగిసింది, పహల్గామ్ బాధితులకు సంతాపం వ్యక్తం చేసి, వారి కుటుంబాలకు సంఘీభావం తెలియజేస్తూ బలమైన సందేశాన్ని పంపింది. ఈ నిరసనకు పార్లమెంటు సభ్యుడు ప్రొఫెసర్, ప్రముఖ జర్మన్ కార్డియాలజిస్ట్ డాక్టర్ హాన్స్ థీస్, మ్యూనిచ్ నగర కౌన్సిలర్ డెలిజా బలిడెమాజ్ వంటి ప్రముఖ జర్మన్ రాజకీయ ప్రముఖుల మద్దతు పలికారు. ఉగ్రవాదాన్ని ఖండించడానికి, అంతర్జాతీయ శాంతి ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి ప్రదర్శనకారులతో పాటు నిలిచారు. డాక్టర్ థీస్ బాధితుల కోసం ప్రార్థనలు చేస్తూ, ఉగ్రవాదం, మతపరమైన తీవ్రవాదాన్ని అన్ని రూపాల్లో ఖండిస్తూ తీవ్ర భావోద్వేగ సందేశాన్ని ఇచ్చారు. భారతీయ డయాస్పోరా చొరవను ఆయన ప్రశంసించారు. నేరస్థులను న్యాయం ముందు నిలబెట్టాలి. అదే సమయంలో, రెండు అణ్వాయుధ దేశాలు భారత్-పాకిస్తాన్ మధ్య మరింత ఉద్రిక్తతను నివారించడానికి మనం చేయగలిగినదంతా చేయాలి. బాధితులతో అండగా నిలబడతామని అన్నారు. పహల్గామ్ దాడిపై ఆగ్రహించిన భారతీయ సమాజాల ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మ్యూనిచ్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇటీవల యూరప్ అంతటా భారతీయ సమాజ సమూహాలు ఇలాంటి ప్రదర్శనలను నిర్వహించాయి. హింసాకాండలో ప్రభావితమైన వారితో తమ ఆందోళనలను వ్యక్తం చేస్తూ, ఐక్యతను వ్యక్తం చేస్తున్నాయి.

# హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సందడి

- హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సందడి..

పెట్టుబడుల సంగతి ఎలా ఉన్నా..

హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సందడి మాత్రం షురూ అయింది. మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానుండగా.. 31న హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలేతో ముగియనున్నాయి. అదే రోజు విజేతను ప్రకటిస్తారు. జూన్ 2న జరిగే తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకల్లో మిస్ వరల్డ్‌గా నిలిచిన సుందరీమణి పాల్గొంటారు. ఈ పోటీలకు 116 దేశాలకు చెందిన పోటీదారులు హాజరుకానున్నారు. దాంతో.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి హైదరాబాద్ హైటెక్స్ వరకూ బ్యానర్లు, కటౌట్లు కళకళలాడిపోతున్నాయి.



# హైదరాబాద్‌లో 4 ప్రాంతాల్లోనే మాక్‌డ్రిల్స్!

మొదటిపేజీ తరువాయి

మాక్ డ్రిల్స్ చేపడుతున్నారు. నగరంలోని నాలుగు వ్యూహాత్మక ప్రాంతాలైన సికింద్రాబాద్ కంటోన్మెంట్, గోల్కొండ, కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ (రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ), మౌలాలిలోని ఎన్ఎఫ్‌సీలలో బుధవారం సాయంత్రం 4 గంటలకు ఈ భద్రతా విన్యాసాలు ఏకకాలంలో జరగనున్నాయని రక్షణ శాఖ ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా మొత్తం 259 సున్నిత ప్రదేశాలలో ఈ మెగా సెక్యూరిటీ డ్రిల్ నిర్వహించేందుకు కేంద్రం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మాక్ డ్రిల్స్ నిర్వహణపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో, దాడులకు అవకాశం ఉన్న ప్రాంతాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం నగరాలు కేటగిరీ-2లో ఉన్నాయి.

# భూసేకరణ తర్వాతే ట్రిపుల్‌ఆర్

మొదటిపేజీ తరువాయి

ఇదివరకే టెండర్లు పిలిచినప్పటికీ భూసేకరణ సమస్య కారణంగా ఇంకా ఏజెన్సీలను ఖరారు చేయలేదు. అయితే ట్రిపుల్‌ఆర్‌కు కేంద్రం నుంచి ఫైనాన్షియల్, క్యాబినెట్ అనుమతులు రావాల్సి ఉన్నదని అధికారులు చెప్తున్నారు. సోమవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన గడ్కరీని సీఎం రేవంత్, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలిసి తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందులో భాగంగా ట్రిపుల్‌ఆర్‌కు కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులను వెంటనే ఇచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై గడ్కరీ స్పందిస్తూ.. భూసేకరణను పూర్తిచేయాలని సూచించినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ పూర్తయితే ట్రిపుల్‌ఆర్ పనులను చేపట్టేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేసినట్టు సమాచారం. ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి 1,950 హెక్టార్ల భూములు సేకరించాల్సి ఉండగా.. అందులో ఇప్పటివరకు 85% భూసేకరణ పూర్తయింది. ట్రిపుల్‌ఆర్ నిర్మాణంలో భాగంగా భూములు, పంటలు, ఇండ్లు తదితర ఆస్తులు కోల్పోతున్న బాధితులకు రూ.5,100 కోట్ల మేరకు నష్టపరిహారం అందించాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. ఈ ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాల్సి ఉన్నది. దీంతో తమ వాటా కింద రూ.2,550 కోట్లు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.1,250 కోట్లు కేటాయించింది.

# ఆదమరిస్తే...అంతేసంగతి..!

- ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా డ్రైనేజీ గుంత
- పట్టించుకోని అధికారులు
- నిత్యం వంద సంఖ్యలో వాహనాల రాకపోకలు



బొల్లారం / తొలిఅడుగు : ఎవరైనా పాదచారులు ఆదమరిస్తే అంతే సంగతి ప్రమాదం సంభవించక తప్పదు. అయినా అధికారులు మాత్రం ఆ విషయం పట్ల ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. బొల్లారం నుంచి బాచుపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో డ్రైనేజీ గుంత ప్రమాదకరంగా మారింది. పై కప్పు పగిలిపోవడంతో తెరుచుకొని ఉంటుంది. దీంతో ఎప్పుడూ ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ అధికారులు మాత్రం ఆ డ్రైనేజీపై కప్పును ఏర్పాటు చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. నిత్యం ఈ రహదారి గుండా వందలాది వాహనాలతో పాటు.. వేల మంది రాకపోకలు సాగిస్తారు. అయినప్పటికీ అధికారులు మాత్రం అవేమి పట్టడం లేదు. వాహనాదారులతో పాటు పాదచారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పెద్దగా ముప్పు లేకపోయినప్పటికీ.. ఎప్పటికైనా ఇది ప్రమాదానికి కారణం అయ్యేది. అయినప్పటికీ అధికారులు ఈ డ్రైనేజీపై పై కప్పు ను ఏర్పాటు చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించడం పట్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఇలా నిర్లక్ష్యం గా వ్యవహరించడం మంచిది కాదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ఇటువంటి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉంది. లేకుంటే భవిష్యత్తులో ఇటువంటి చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు కారణం అయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం కదలాల్సిన అవసరం ఉంది.



# సమ్మర్ క్లాసులు నిర్వహించే కళాశాల ల పర్మిషన్ రద్దు చేయాలి

- ఏ ఐ ఎఫ్ డి ఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పల్లె మురళి, గడ్డం నాగార్జున




శేరిలింగంపల్లి / తొలిఅడుగు : వేసవిలో తరగతులు నిర్వహించే కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎఐఎఫ్ డీఎస్ ప్రతినిధులు మాట్లాడారు. కార్పొరేట్ కళాశాలలు కాసుల వర్షం కురిపించుకోవడానికే తపన పడుతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా ఫీజుల కోసం కార్పొరేట్ కళాశాలలు దిగజారుతున్నాయన్నారు. విద్యార్థులను ర్యాంకుల కోసం మర యంత్రాలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సెలవులు ఇవ్వకుండా విద్యార్థులను ఒత్తిడిల నడుమ చదువులు సాగించడం దురదృష్టకరమన్నారు. గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కన్వీనర్ ముత్తన్నగారి శ్రీకాంత్ అధ్యక్షతన తాంద్ర రామచంద్రయ్య భవన్ లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏ ఐ ఎఫ్ డి ఎస్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పల్లె మురళి గడ్డం నాగార్జున హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా గ్రేటర్ హైదరాబాదులో ఉన్నటువంటి కార్పొరేట్ కళాశాలలు సమ్మర్ క్లాసులు నిర్వహించడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నిసార్లు ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసిన పట్టించుకోక పోగా వారికి లోపాయికార ఒప్పందం చేసుకొని మద్దతు చేస్తున్నటువంటి డిఐఈఓ ను తక్షణమే సస్పెండ్ చేసి సమ్మర్ క్లాసులు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమ్మర్ క్లాసుల వల్ల విద్యార్థిని, విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై చదువుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సమ్మర్ హాలిడేస్ మానసికంగా ఉల్లాసంగా ఉండాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వేసవి సెలవులలో క్లాసులు నిర్వహించడం బాధాకర విషయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమ్మర్ క్లాసు నిర్వహిస్తున్న కళాశాలల పర్మిషన్ రద్దుచేసి తక్షణమే ఆ కళాశాల యాజమాన్యంపై చట్టరీత్య క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కాగా ప్రభుత్వంలో ఉన్న కొందరు పెద్దలకు చెందిన కళాశాలలు ఉండడం వారికి రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండడంతో ఈ కార్పొరేట్ దందా యదేచ్ఛగా కొనసాగుతుందన్నారు. ఇదిలాగే కొనసాగితే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అరుణ్ వేణు ప్రశాంత్ పవన్ రాజేష్ సన్నీ వంశీ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలపై ఉక్కుపాదం




-గచ్చిబౌలిలోని అక్రమ నిర్మాణాలు నేలమట్టం - మళ్లీ హైడ్రా కూల్చివేతలు
- గచ్చిబౌలిలోని పలు నిర్మాణాలు నేలమట్టం - అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం


అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తుంది. అందులో భాగంగా మంగళవారం శేరిలింగంపల్లి లోని ఆయా ప్రాంతాల్లో హైడ్రా బృందం పలు అక్రమ నిర్మాణాలను కూల్చి వేసింది. కాగా గత కొన్ని రోజులుగా స్తబ్దుగా ఉన్న హైడ్రా ఒక్కసారిగా రంగంలోకి దిగడంతో చర్చనీయాంశంగా మారింది. కాగా హైడ్రాను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుంది. ఇప్పటికే హైడ్రాకు విశేష అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఇప్పుడు ప్రత్యేకంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసి నిత్యం అక్రమాలను పర్యవేక్షించడానికి చర్యలు చేపట్టనున్నారు. కాగా శేరిలింగంపల్లి జోనల్ పరిధిలో ఒక్కసారిగా హైడ్రా ఉక్కుపాదంతో కూల్చివేతలు ప్రారంభించడంతో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ గా ఐఏఎస్ అధికారి హేమంత్ బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజుల వ్యవధిలో హైడ్రా అక్రమ నిర్మాణాలపై దూకుడుగా ప్రదర్శించడంతో సామాన్యులు సైతం హర్షిస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, నాలాల పరిరక్షణ కోసం హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గతేడాది జులైలో హైడ్రాను ఏర్పాటు చేయగా... సినీ హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సహా.. ఇప్పటి వరకు వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. అయితే గత కొన్ని రోజులుగా సైలెంట్‌గా ఉన్న హైడ్రా బుల్డోజర్లు.. మళ్లీ అక్రమ నిర్మాణాలపై దూసుకెళ్లాయి. నేడు హైదరాబాద్ గచ్చిబౌలిలోని పలు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సంధ్యా కన్వెన్షన్ సెంటర్‌లోని మినీ హాల్, ఫుడ్‌కోర్ట్‌లను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 124, 127లలోని దాదాపు 20 ఎకరాల భూమిలో గతంలో ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లేఅవుట్ వేసింది. ఈ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన 162 మంది సంధ్యా కన్వెన్షన్ యజమానులు తమ సొసైటీ లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. గతంలో వేసిన లేఅవుట్‌ను మార్చి, రోడ్లు, పార్కులను ఆక్రమిస్తూ సంధ్యా కన్‌స్ట్రక్షన్ అనేక అక్రమ కట్టడాలు చేపట్టిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు... ఉదయం నుంచి అనుమతులు లేని నిర్మాణాలను తొలగించే పనిని ప్రారంభించారు. సంధ్యా కన్వెన్షన్‌కు చెందిన మినీ హాల్, వంటగదులు, విశ్రాంతి గదులతో పాటు, లేఅవుట్‌ను ఆక్రమించి నిర్మించిన రేకుల కంచె, జీ2గా నిర్మించిన మూడు ఇనుప షెడ్లను తొలగించారు. మరికొన్ని నిర్మాణాలను కూల్చివేయనున్నట్లు హైడ్రా అధికారులు వెల్లడించారు.





కాగా, అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. ప్రత్యేకంగా హైడ్రా పోలీస్ స్టేషన్‌ను సైతం ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. బుద్ధభవన్ సమీపంలోని ఒక భవనంలో రెండు అంతస్తుల్లో ఈ పోలీస్ స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. ఈ నెల 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. ఈ పోలీస్ స్టేషన్‌లో ఒక ఏసీపీ, ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది ఎస్ఐలు, 30 మంది కానిస్టేబుళ్లతో పాటు 70కి పైగా సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ ప్రత్యేక పోలీస్ స్టేషన్ భూ కబ్జాలతో పాటు అక్రమ ఇసుక దందాపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు చెప్పారు. నగరంలో అక్రమాలకు పాల్పడే వారిని కటకటాల వెనక్కి పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామని హైడ్రా కమిషనర్ వెల్లడించారు.



# ఆపదలో ఉన్న స్నేహితునికి సాయం

– మనలో ఒకరికైతే ..అందరికీ

తొలిఅడుగు, ధర్మపురి ప్రతినిది, మే 06. : స్నేహబంధం అనేది కాలానుగుణంగా మారదని, అది కాలాన్ని మించి నిలిచే బంధమని వెల్గటూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009వ సంవత్సర విద్యార్థులు మరోసారి రుజువు చేశారు. ఆ బ్యాచ్ తో కలిసి చదువుకున్న ముత్తునూర్ గ్రామానికి చెందిన కండ్లె శామ్యూల్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. తదానంతర కార్యక్రమానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని తమ వంతుగా అందిస్తూ మానవీయతను చాటుకున్నారు. ఎసెస్సీ 2009 ఫౌండేషన్ ద్వారా స్నేహితులందరూ కలిసి 15,900/- రూపాయలు సేకరించి బాధిత మిత్రునికి అందజేశారు. ఈ చర్య ఆ కుటుంబానికి ఎంతో భరోసాగా, ఓదార్పుగా నిలిచింది.

మే 28, 2023 న అంటే దాదాపు 15ఏళ్లకు స్నేహితులందరూ కలిసి అట్టహాసంగా ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనంలో సవాలుతో కూడిన నిర్ణయాన్ని తీసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి, సమాజములో ఎలా ముందుకు సాగాలో నేర్పినటువంటి ఉపాధ్యాయుల సమక్షంలో 'ఎస్సెస్సీ 2009 ఫౌండేషన్'ను స్థాపించారు. అప్పటి నుండి ఈ సంస్థ తమ బ్యాచ్ లోని మిత్రులకు ఏ ఆపద వచ్చినా 'మనలో ఒకరికైతే బి అందరికీ' అనే నినాదంతో ఆర్థికంగా అండగా నిలుస్తోంది. "స్నేహం అంటే కలిసి చదువుకున్న రోజులకే పరిమితం కాదు. జీవితంతా నిలిచే అనుబంధం, ఆపదలో మిత్రులకు వెన్నుగా ఉండగలగడం మాకు గర్వంగా ఉందనీ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఫౌండేషన్ ద్వారా ఎసెస్సీ 2009 బ్యాచ్ చేస్తున్న సేవలను గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రశంసిస్తూ, "ఈ తరం విద్యార్థులకు మాత్రమే కాదు. రాబోయే తరం యువతకు ఇది మార్గదర్శకంగా నిలుస్తుంది" అని అభినందించారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– మహిళా చట్టాలపై ఆర్వీఎం ఆస్పత్రి ఆవరణలో మహిళలు ఉన్న ప్రదేశానికి వెళ్లి అవగాహన కల్పిస్తూ రక్షణా గా నిలుస్తున్న గజ్వేల్ షీటీమ్ బృందం
– అపరిచితుల వ్యక్తుల మాటలు నమ్మవద్దు




తొలిఅడుగు, గజ్వేల్, మే 06 : ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రి ఆవరణలో ప్రజలకు మహిళలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత. గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్కూల్ వెళ్లే పిల్లల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని సూచించారు,

సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిది సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉంది దానికి అలవాటు పడి బానిసలు కావద్దు సూచించారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మరియు అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

లిఅవగాహన కల్పించిన ములుగు ఏఎస్ఐ అండాలు, గజ్వేల్ షీటీమ్ బృందం ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ లావణ్య కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మహేష్ ములుగు పోలీస్ స్టేషన్ సిబ్బంది విజయ్, కనకయ్య, నర్సింలు, తదితరులు ఉన్నారు.

## జడ్జి వర్ధం నిఖిషా క్రాంతికుమార్ దంపతులకు ఘన స్వాగతం



తొలిఅడుగు, గజ్వేల్, మే 06 : సిద్ధిపేట జిల్లా గజ్వేల్ వాస్తవ్యులు ప్రముఖ వ్యాపారవేత్త లయన్ వర్ధం రాజు కోడలు వర్ధం నిఖిష జడ్జిగా పట్టా పొంది సోమవారం గజ్వేల్ వచ్చిన సందర్భంగా వారికి ఘన స్వాగతం పలికారు కుటుంబ సభ్యులు. ఈ సందర్భంగా జడ్జి వర్ధం నిఖిషా క్రాంతి కుమార్ దంపతులకు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాజీ మ్మెల్యే టి. నర్సారెడ్డి గజ్వేల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్ర బోస్, జాహుర్, ఇక్బాల్, రాంచంద్ర చారి, గాడిపల్లి శ్రీనివాస్, ఇతర ప్రముఖులు, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ ... గజ్వేల్ ముద్దుబిడ్డ ప్రముఖ వ్యాపారవేత్త వర్ధం రాజు పెద్ద కుమారుడు క్రాంతి కుమార్ సతీమణి వర్ధం నికిషా జడ్జిగా పట్టా పొంది గజ్వేల్ కి పేరు తేవడం సంతోషంగా ఉందని జడ్జిగా బాధ్యతలు స్వీకరించి మంచి పేరు సంపాదించాలని, గజ్వేల్ పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# రాష్ట్రం నడపడం అంటే రంకలేయడం కాదు రేవంతన్న



తొలిఅడుగు, : ముఖ్యమంత్రి అంటే ముచ్చట్లు చెప్పి కడుపు నింపేటోడు కాదు

ఆకలితో ఉన్నోనికి పట్టేడు అన్నం పెట్టేటోడు

సంపదను పెంచి అందరికీ పంచేటోడు

కానీ నువ్వు ఎక్కి నుంచి ఒక్కటే మొత్తుకుంటున్నావ్

దివాలా దివాలా దివాలా అని నీ దిగజారుడు వ్యాఖ్యలతోనే ఇయ్యాల ఈ పరిస్థితి వచ్చింది

కెసిఆర్ అప్పే చేసిండో ఆదాయమే పెంచిండో కానీ సంపద సృష్టించి సాది సవరించిన రాష్ట్రాన్ని

నీ దివాలా వ్యాఖ్యలతో దిగాలు పడేస్తున్నావ్

పద్దులు తెలవని నిన్ను పరిపాలకున్ని చేస్తే సొంతం రాష్ట్రాన్ని సంకనాకిస్తున్నవ్

లంకె బిందెలు ఉన్నాయని వచ్చిన గాని కాలికుండలే ఉన్నాయని మాట్లాడితే ప్రభుత్వం నడిపే అనుభవం లేదు కదా నేర్చుకుంటాడేమో అనుకున్నాం.

కానీ నువ్వు ఎక్కిన ఘడియెందో గానీ అన్ని ఎన్కకే నడుస్తున్నాయి

తెలంగాణ వచ్చినంక జెర తెల్లగ ఐతున్నం అనుకుంటే నీ ఏడుపుగొట్టు వ్యాఖ్యలతో రోజుకింత రాష్ట్రం ఎలిసిపోతూనే ఉన్నది

కెసిఆర్ ఏమున్నా లేకున్నా గుప్పిట బట్టి గుట్టుగా తెలంగాణ పతార పెంచితే

అప్పు అప్పు అని తప్పుడు మాటలు మాట్లాడితివి...

ఏడికి వచ్చే నీ కథ నువ్వే మల్ల ఇయ్యాల అప్పు పుడతలేదు, చెప్పులెత్కపోయే దొంగ లెక్క చూస్తున్నారు అని చెత్త మాటలు మాట్లాడే కాడికి వచ్చె....

3 లక్షల కోట్ల బడ్జెట్ పెడితే ఆదాయం కూడా మూడు లక్షల ఉంది అనుకున్న గింత మాత్రం చేయకపోదునా అని అనుకున్న అనే నీ మాటలు చూస్తుంటే నవ్వొస్తుంది కాదు కాదు కాదు ఏడుపొస్తుంది ఎట్లున్న తెలంగాణ ఎట్లా అయిపాయె అని

కెసిఆర్ అప్పు చేస్తే చేసిండేమో కని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి మా పొలాలు పండించిండు

పెద్దపెద్ద కరెంటు లైన్లు గుంజి 24 గంటల కరెంటు ఇచ్చిండు

పెద్ద దావఖానాలు కట్టిండు

మెడికల్ కాలేజీలు పెట్టిండు మిషన్ భగీరథ తోటి ఇంటింటికి నల్ల పెట్టి నీళ్లు ఇచ్చిండు

చెరువులలో పూడిక తీసి భూగర్భ జలాలు పెంచిండు

72 వేల కోట్లు రైతుల ఖాతాల్లో రైతుబంధు వేసిండు

రైతు భీమా కట్టిండు

లక్షలాదిమంది ఆడపిల్లల పెళ్లిళ్లకు సాయం చేసిండు

పింఛన్లు పెంచి పెద్దమనుషులకు ఆసరా అయుండు...

గురుకులాలు పెట్టి పిల్లలకి చదువు చెప్పిండు

ఇట్లా చెప్పుకుంటూ పోతే చానా చేసిండు

మరి 16 నెలల లక్షా అరవై వేల కోట్ల అప్పు తెచ్చిన నువ్వు ఏం చేసినావో అర్థం కాక వచ్చింది.

ఏమన్నా అంటే అప్పులు కట్టిన జీతాలు వెళ్తలేవు మీరే చేసుకోండి ఎట్లా పంచుతారో పంచుమ్రి అని మాట్లాడుతున్నావ్.

అన్ని మేమే చేసుకున్నాక మీ అవసరం మాకెందుకు ఉంటదిగా.

నువ్వు వచ్చినంక రెండు నెలల పించన్ ఎగ్గొడితివి...

ఒక కారు రైతుబంధు ఎగ్గొడితివి

రుణమాఫీ చేస్తానని చెప్పి సగం చేస్తివి

అన్నీ సగం సగం ఆగమాగం తప్ప ఏది కొనఎల్లకపోయే....

18 గంటలు పని చేస్తున్న అని చెప్తావు కదా ఎందుకు పద్దెనిమిది రూపాయలు ఆదాయం పెరుగుతలేదు

ఎందుకు జీతాలే ఎల్తలేవ్

కడుపు కట్టుకునే పని చేస్తివి

ఎందుకు పతార లేకుంట ఐపాయె

ఆదాయం పెంచుతాం పేదలకు పంచుతామంటివి

ఎందుకు గిట్ల అప్పుటకుంట అయిపాయె

నోరు మంచిదైతే ఊరు మంచిదైతది

ఏడైనా రూపాయి పుడుతుంది

కానీ నీ నోరే మంచిది కాదాయే

నీ దివాలా కోరు మాటలతో రాష్ట్రం రోజుకింత దిగినట్టే కావట్టే....

ప్రతిపక్షంలో ఏది పడితే అది ఒర్రినట్టు కాదు పరిపాలించడం అంటే....

దానికి ఎంతో దక్షత ఉండాలి

అన్నింటికీ మించి ప్రజల పట్ల ప్రేమ ఉండాలి

రాష్ట్రం పట్లఎంతో తపన ఉంటే గాని రాజుగా సక్సెస్ కాలేవు..

ఇప్పటికైనా ఈ పూటకుల్ల మాటలు బంద్ చెయ్

చేయ చాతకాకపోతే అడుగు అంతేగాని రాష్ట్రాన్ని అడుగుపట్టియ్యకు....

పాలోని ముంగట పజీతను చేయకు....

నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచకు

6 గ్యారంటీలు ఏమోగానీ నువ్వు ఇట్లనే చేస్తే అడుక్క తినడం మాత్రం గ్యారంటే...

ఇప్పుడు పెట్టండి మూడు రంగుల జెండా పాట

మూడు రూపాలన్నా అప్పు పడుతదేమో సూద్దాం...

జై తెలంగాణ....

బాయ్ రేవంతన్న....

మీ.

మాదాసు శ్రీనివాస్.

# జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ అధ్వర్యంలో జనగామ పోలీస్ స్టేషన్ లో కూల్ వాటర్ ఫ్రిడ్జ్ ను బహుకరణ





తొలిఅడుగు, గజ్వేల్, మే 06 : జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ అధ్వర్యంలో జనగామ పోలీస్ స్టేషన్ లో కూల్ వాటర్ ఫ్రిడ్జ్ ను బహుకరించారు. ఈ నేపథ్యంలో జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ చైర్మన్ దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ ప్రజల శ్రేయస్సుకై మరో ముందు అడుగు వేసి స్థానిక పోలీస్ స్టేషన్ లో కూల్ వాటర్ ఫ్రిడ్జ్ బహుకరించారు. ఈ సందర్భంగా జనగామ సిఐ పి దామోదర్ రెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ఈ కూల్ వాటర్ ఫ్రిడ్జ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ... నిత్యం తమ సమస్యల పై ప్రజలు పోలీస్ స్టేషన్ కి రావడం ఈ వేసవి కాలంలో ప్రజలకు పోలీస్ వారికి నిత్యం ఉపయోగపడే కూల్ వాటర్ ఫ్రిడ్జ్ ని అందచేసిన దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా వారి సంస్థ ఆద్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలి అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎస్ ఐ లు రాజన్ బాబు , ఎస్ ఐ రాజేష్ ,ఎస్ ఐ చెన్నకేశవులు, మల్లిగారి రాజు, రాజు రాడ్రిక్స్ మచ్చ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# జనగామ అమ్మ ఫౌండేషన్ లో పుట్టిన రోజు వేడుకలు



తొలిఅడుగు, జనగామ, మే 05 : తెలంగాణ వికలాంగుల వేదిక జనగామ జిల్లా అధ్యక్షులు మేకల సమయ్య పుట్టినరోజు సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాల వద్ద చిన్న పిల్లల మధ్యలో కేక్ కట్ చేసి అరటి పండ్లు పంపిణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మని ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ... పుట్టినరోజు జరుపుకుంటున్న సమయ్య కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు..అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అరటి పండ్లు పంపిణి కార్యక్రమం నిర్వహించి సమయ్య కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర వికలాంగుల వేదిక అధ్యక్షురాలు బొట్ల సుమతి హాజరై వారి సేవలను కొనియాడారు. నిరంతరం సేవే లక్ష్యంగా జనగామ అమ్మ ఫౌండేషన్ టీం సభ్యులు, బోట్ల సాయి, పండగ నరేష్,మద్దెల కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన తహసీల్దార్ ను మర్యాద పూర్వకంగా కల్సిన మణుగూరు ఆదివాసీ జేపీసీ నాయకులు




తొలిఅడుగు, మణుగూరు, మే 06 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్ ను మణుగూరు ఆదివాసీ జేఏసీ నాయకులు కలిసి ఘనంగా చాలువతొ సన్మానించారు. అనంతరం ప్రస్తుతం ఉన్న సమస్యలను, గతంలొ ఎదురుకున్న సమస్యలను వివరించారు. గిరిజనేతరులతో నిత్యం సమస్యలు ఎదురు అవుతూనే ఉన్నాయని రాజకీయ నాయకులు మారిన, ప్రభుత్వ అధికారులు మారిన మణుగూరు మండల ఆదివాసీ సమస్యలు మాత్రం మారడంలేదు. గిరిజనేతరులు మాత్రం ఏ నూతన అధికారులు వచ్చిన తమ పలుకుబడి ఆర్థిక బలంతో దగ్గర చేసుకొని ఒక్క ఫోన్ కాల్ తో తమ పనులను చేపించుకుంటున్నారని, అదే ఆదివాసీ ప్రజలు మాత్రం కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేయవలసి వస్తుంది అని, అలాగే వివిధ ప్రభుత్వ పథకాలు ప్రతి గ్రామంలోని పేద గిరిజనులుకు అందేలా చూడాలని వివరించారు. మణుగూరు మండలంలో చాలా భూమి సమస్యలు ఉన్నాయని గిరిజనులకు తెలిసి తెలియక గిరిజనేతరుల చేత మోసపోయిన వారు చాలా మంది ఉన్నారని అలాంటి వారందరికీ న్యాయం చేయాలనీ అన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టిన ప్రతి గ్రామంలో పిసా గ్రామసభలు ద్వారానే ఏంపిక చేయాలనీ గ్రామసభలే ఏజెన్సీ ప్రాతంలో సుప్రీం కోర్ట్ తీర్పు అని వివరించారు. ఇలాంటివి ఇంకా చాలా ఉన్నాయని ఎంత మంది కొత్త అధికారులు వచ్చిన మా ఆదివాసీ చట్టాలనుగాని, మా ఆదివాసీ సమస్యలనుగాని పట్టించుకున్న నాధుడు లేడు మీరైనా వీటిని అమలు చేయాలని అన్నారు. తహసీల్దార్ స్పందించి మీకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎప్పుడు ఏ సమస్య వచ్చిన నేరుగా నాదగ్గరకు వచ్చి మీ సమస్యలు చెప్పండి అని మీకు కావాల్సిన న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలొ మణుగూరు మండల జేఏసీ అధ్యక్షుడు సోడే రవికుమార్ దొర, ఆదివాసీ జేఏసీ ఉపాధ్యక్షులు పూనెం రమేష్, ఇర్ప రవికుమార్, గణిబోయిన ముత్తయ్య, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, ఆదివాసీ జేఏసీ కోశాధికారి జోగ సురేంద్ర ప్రసాద్, ఆదివాసీ కార్యదర్శి పూనెం నాగరాజు, కాటిబోయిన నర్సింహా రావు, గణిబోయిన నాగేశ్వరరావు, కోడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రాత్మక పథకాల అమలు సీఎం రేవంత్ రెడ్డి తోనే సాధ్యం

- ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- నియోజకవర్గంలో 800 లకు పైగా కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి



తొలిఅడుగు, గజ్వేల్, మే 06 : రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి పేదింటి పెద్దగా ఆదుకుంటూ ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తో కలిసి గజ్వేల్ సమీకృత భవనంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ఖజానాపై భారం పడుతున్నప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలకు పెద్దపీఠ వేసి అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూ%శీ%కుంట నర్సారెడ్డి చొరవతో, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో గజ్వేల్ నియోజకవర్గంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న 800 లకు పైగా కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను యుద్ధ ప్రాతిపదికన లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అయితే చెక్కుల గడువు దగ్గర పడుతున్నందున వెంటనే లబ్ధిదారులు తమ ఖాతాలలో జమ చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఈ రోజుల్లో పేదింటి ఆడపిల్ల పెళ్లి చేయడం ఎంతో కష్టం కాగా, దీన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి ఆడపడుచు కానుకగా కళ్యాణ లక్ష్మి నిధులు మంజూరి చేసినట్లు గుర్తు చేశారు. అంతేగాకుండా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరీ చేస్తుండగా, ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను పేదలు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని చెప్పారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ పంట రుణమాఫీ, కుల గణన, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి, భూభారతి తదితర చారిత్రాత్మక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రవీణ్, శ్రావణ్, సుఖేందర్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు మొనగారి రాజు, రాములు గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరి, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, సమీర్, నేతలు జహీర్, జంగం రమేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, అజహర్, జాకీర్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరిపై శ్రీ రేణుకా మాత ఆశీస్సులు ఉండాలి

- గ్రామ దేవతలను పూజిస్తే అంతా మంచే జరుగుతుంది
- డిసిసి అధ్యక్షులు తూ%శీ%కుంట నర్సారెడ్డి



తొలిఅడుగు, గజ్వేల్, మే 06 : ప్రతీ ఒక్కరిపై శ్రీ రేణుకా మాత అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు ఉండాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూ%శీ%కుంట నర్సారెడ్డి ఆకాంక్షించారు. సోమవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా గౌడ సంఘం ఆహ్వానం మేరకు ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన అవసరం కాగా, గ్రామదేవతలను పూజిస్తే అంతా మంచే జరుగుతుందని స్పష్టం చేశారు. పండగ పర్వదినాలలో గ్రామీణ ప్రాంత ఆలయాల వద్ద ఆధ్యాత్మిక భావన వెల్లువిరుస్తుందని, పాడి పంటలు సంవృద్ధిగా పండుతాయని తెలిపారు. కాగా ఆలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని, ముఖ్యంగా గజ్వేల్ ప్రాంతం పుణ్యక్షేత్రాలకు ప్రసిద్ధిగా నిలిచిందని వివరించారు. కాగా మొదటగా స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు.

# కార్మిక ఐక్యత, మెరుగైన వేతన ఒప్పందం కోసం సిఐటియుని గెలిపించండి

- మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు
- రాణే బ్రేక్ లైనింగ్ పరిశ్రమ గేటు సమావేశంలో పిలుపు




తొలిఅడుగు, గజ్వేల్, మే 06 : రాణే బ్రేక్ లైనింగ్ లిమిటెడ్ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సిఐటియును భారీ మెజార్టీతో తో గెలిపించాలని చుక్క గుర్తుకు ఓటు వేయాలని, మే 20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు, ఉపాధ్యక్షులు మల్లికార్జున గారు పిలుపునిచ్చారు. పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో భాగంగా ఈరోజు పరిశ్రమ గేటు ముందు యూనియన్ అధ్యక్షులు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్ గారి అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా చుక్కా రాములు మల్లికార్జున్ లు మాట్లాడుతూ సిఐటియు కార్మిక పక్షపాతి అని కార్మికుల యొక్క మెరుగైన జీవన ప్రమాణాల కోసం యజమాన్యలతో రాజీ లేని పోరాటలు నిర్వహిస్తుందని అన్నారు. గతంలో 10000 పైగా వేతన ఒప్పందం చేసి కార్మికుల కుటుంబాలకు మెరుగైన మెడికల్ పాలసీని, జిపిఏను అమలు చేసి కార్మిక ఎటువంటి నష్టం రాకుండా కార్మికులకు ఎటువంటి నష్టం రాకుండా అనేక సంక్షేమ పథకాలు అమలు చేపిస్తూ కాపాడుకున్నదని అన్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరి సంక్షేమ కోసం సిఐటియు కృషి చేస్తుందని అన్నారు. వివిధ రూపాల్లో కార్మికులు మరణించినప్పుడు వారి కుటుంబాలకు అండగా ఉండే విధంగా పథకాలు తయారుచేసి ఆదుకున్నామన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు నష్టం చేసే విధమైన కోడ్ లను రూపొందించడం జరిగిందని వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు ఉద్యోగ సంఘాలు కోడ్ లకు వ్యతిరేకంగా మే 20న సమ్మె చేస్తుంటే బిఎంఎస్ సంఘం మాత్రం కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ, యజమానులకు అనుకూలంగా ఉండే 12 గంటల పని, ఈఎస్ఐ పిఎఫ్ గ్రాడ్యుటి బోనస్ ఇలాంటి అనేక సంక్షేమ పథకాలు యజమానుల చేతిలో పెడుతుంటే కార్మిక సంఘంగా ఖండించాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వానికి, పరిశ్రమ యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని సమ్మెలో పాల్గొనడం లేదని అన్నారు. పరిశ్రమ భద్రత, ఉద్యోగ భద్రత ప్రమాణాలు, సంక్షేమ పథకాలను నూతన కోడ్ లలో నిర్వీర్యం చేసిందని అన్నారు. కులం, మతం, ప్రాంతం పేరు లతో విభజించే కార్మికుల ఐక్యతను విచ్చినం చేసే బిఎంఎస్ ను ఓడించాలని సిఐటియును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ దువ్వల బిక్షపతి, యూనియన్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,రవికుమార్,మల్లయ్య,నర్సింలు,రంగారెడ్డి, వి వెంకట్రావు,ఏ స్వామి, శ్రీనివాస్, సాజిద్, కృష్ణమూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ సతీమణి అడ్లూరి కాంతా కుమారి

- మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ గుండాటి గోపిక-జితేందర్ రెడ్డి,



తొలిఅడుగు, ధర్మపురి ప్రతినిధి, మే 06 : వెల్గటూర్ మండలంలోని పాశిగామ, కోటిలింగాల, మొక్కటరావుపేట, ముత్తునూరు, రాంనూరు, గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్, లక్ష్మణ్ కుమార్ సతీమణి అడ్లూరి కాంతా కుమారి, మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ గుండాటి గోపిక-జితేందర్ రెడ్డి, మండల నాయకులు, అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ మాట్లాడుతూ... ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా అకాల వర్షాల దృష్ట్యా వడ్ల కొనుగోలు త్వరితగతిన చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్. శేఖర్, వైస్ చైర్మన్ గొల్ల తిరుపతి, డైరెక్టర్ జూపాక ప్రవీణ్, నాయకులు గుండాటి సందీప్ రెడ్డి, బొప్పు తిరుపతి, గుమ్ముల వెంకటేష్, కూస లక్ష్మణ్, కొమురయ్య,సెంటర్ ఇంచార్జిలు, రైతులు పాల్గొన్నారు.

# డి సి ఓ ఆకస్మిక తనిఖీ



తొలిఅడుగు, ధర్మపురి ప్రతినిది, మే 06 : పెగడపల్లి మండలంలోని బత్కపల్లి పిఎసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పెగడపల్లి తహసీల్దార్ రవీందర్ నాయక్, ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ తో కలిసి జగిత్యాల డి సి ఓ మనోజ్ కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సెంటర్ నిర్వాహకులకు వరి ధాన్యం తూకం వేగవంతం చేసి త్వరలో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీస వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లు చాట్ల విజయభాస్కర్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, నాయకులు ముద్దుగంటి పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎనలేని సేవలు

- పదోన్నతిపై బదిలీ అయిన రాజారత్నం కు ఘన సన్మానం



తొలి అడుగు న్యూస్ - షాద్ నగర్, మే 06 : షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా రైతులకు వ్యవసాయ శాఖ ఏడిఏ రాజారత్నం ఎనలేని సేవలందించారని వ్యవసాయ శాఖ అధికారులు కొనియాడారు. నారాయణపేట జిల్లా అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ(ఆత్మ)లో డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ గా పదోన్నతి పై వెళుతున్న రాజారత్నం ను వ్యవసాయ అధికారులతో పాటు డీలర్లు ఘనంగా సన్మానించారు. వ్యవసాయ శాఖ ఏడిఏ గా ఆయన రైతులకు అందించిన సేవలను కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ నర్సింహారావు గారు ,మహబూబ్నగర్ జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ గారు , వివిధ మండల వ్యవసాయ అధికారులు నిశాంత్ కుమార్, రాజేందర్ రెడ్డి ,గోపాల్ ,సురేష్ రెడ్డి ,శోభా వివిధ మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులతో పాటు డీలర్లు పాల్గొన్నారు.

# డిగ్రీ విద్యార్థులతో చెలగాటమాడుతున్నరా..? విద్యార్థిని ఆవేదన..

- తక్షణమే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి..
- డిగ్రీకళాశాల విద్యార్థిని, శ్వేత యాదవ్..
- అయోమయంలో డిగ్రీ కళాశాల యజమాన్యాలు..? రియంబర్స్మెంట్ రాకపోవడంతో నిరాశ..
- రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీలలో డిగ్రీ పరీక్షలు వాయిదా వేసిన వాటిని తక్షణమే రీ షెడ్యూలు ప్రకటించి పరీక్షలు నిర్వహించాలి..
- శ్వేత యాదవ్ డిమాండ్..



తొలి అడుగు న్యూస్ - షాద్ నగర్, మే 06 : పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాకపోవడంతో ఫీజులు చెల్లించలేనిదే పరీక్షలు నిర్వహించమని ప్రైవేటు కాలేజీల యజమాన్యం చెప్పడంతో యూనివర్సిటీ పరిధిలో ఇప్పటికీ రెండు మూడు సార్లు పరీక్షలు వాయిదా పడ్డాయని, ప్రైవేటు కాలేజీల యజమాన్యంతో యూనివర్సిటీ అధికారులు చర్చలు జరిపి డిగ్రీ పరీక్షలు వెంటనే నిర్వహించాలని, ఇప్పటికే విద్యా సంవత్సరం ముగిసిందని పరీక్షలు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఎలా ఉన్నత చదువులకు వెళ్లడం పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడం అవుతుందని శ్వేతా యాదవ్ డిగ్రీ విద్యార్థిని డిమాండ్ చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు..

# నిర్లక్ష్యపు నీడలో రోడ్డు కాంట్రాక్టర్..

- రోడ్డు కాంట్రాక్టర్ జరా ఇటూ చూడవయ్యా..
- కమ్మదనం నుంచి గంట్లవెల్లి ఆగిన రోడ్డు నిర్మాణ పనులు..
- నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు..
- కంకరా వేశావు డాంబర్ మరీచావు..



తొలి అడుగు - షాద్ నగర్ , మే 06 : ఫరూఖ్ నగర్ మండలంలోని కమ్మదనం గ్రామం నుండి గంట్లవెల్లి గ్రామనికి వెళ్ళే రోడ్డుపనుల్లో కంకర పోసి రోడ్డు వేయడం మరిచారు.. కంకరా వేశావు డాంబర్ మరీచావు రెండు రోజులకు ఒక కారు, రోజుకు ఒక బైకు పడిపోతున్నారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రజలు వాహనదారులు రోడ్డుపై ప్రయాణిస్తూ దీవిస్తున్నారయ్యా..? కాంట్రాక్టర్ ఇటు చూడండి ప్రభో అంటూ రెండు మూడు గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారయ్యా.. వాహనదారులు రాత్రి వేళలో గ్రామాలకు వెళ్లాలంటే ఎప్పుడు కింద పడతాము అని భయభ్రాంతులకు గురవుతున్నారు. నెల క్రితం మొదలుపెట్టిన రోడ్డు కమ్మదనం గ్రామంలో సిమెంట్ రోడ్డు వేశారు గ్రామ శివారు నుండి గంట్ల వెల్లి వరకు కంకర వేసి రోడ్డు మరిచారు. అంటూ గ్రామాల ప్రజలు లాభో దిబోమంటున్నారు.. ఇప్పటికైనా కాంట్రాక్టర్ స్పందించి రోడ్డు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు..

# భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి...జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి..



తొలి అడుగు, షాద్ నగర్, మే 06 : భూభారతితో రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కొందుర్గు మండల పరిధిలోని శ్రీరంగాపూర్, ఉత్తరాస్ పల్లి గ్రామాల్లో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సులను షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి పరిశీలించారు. అనంతరం వారు భూ సమస్యల గురించి రైతులు ఇస్తున్న అర్జీలను స్వీకరించి వివరాలు తెలుసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలు పరిష్కరించుకునేందుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో రూపాయలు 6 లక్షల 30,000 రూపాయల తో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను కలెక్టర్ , ఎమ్మెల్యే కలిసి ప్రారంభించారు. అంతకుముందు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత తాసిల్దారులు రమేష్ కుమార్, జగదీశ్వర్ , మండలపార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్ పురుషోత్తం రెడ్డి, రాములు గౌడ్ , గోవర్ధన్ గౌడ్ ,మల్లేష్ గౌడ్ , జాంగిర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు

తొలిఅడుగు, మణుగూరు, మే 06 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అభిమానులు ఎమ్మెల్యే పాయంకి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పలువురు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ ప్రజలు తనపై చూపించిన అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ఈరోజు జన్మదిన వేడుకలు సందర్భంగా రక్తదానం చేసిన అభిమానులకు, నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు





తెలియజేశారు, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులకు, మహిళ నాయకులకు,అనుబంధ సంఘాల నాయకులకు, ఎస్సీ ఎస్టీ బీసీ సంఘాల నాయకులు,కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసిన పినపాక నియోజకవర్గ శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు.ఈ యొక్క కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిరినకి నవీన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు, శివ సైదులు, మహిళా మండల అధ్యక్షురాలు సౌజన్య, అన్ని మండలాల మండల నాయకులు, అన్ని మండలాల యూత్ కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, మహిళ నాయకులు,కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళిత బంధు జాయింట్ యాక్షన్ (జె ఏ సి) కమిటీ ఏర్పాటు

- కన్వీనర్ గా ఇంజెం వెంకట్ స్వామి.



తొలిఅడుగు, హుజురాబాద్, మే 06 : హుజురాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసినటువంటి దళిత బంధు పైలట్ ప్రాజెక్టు పెండింగ్ నిధులు మంజూరు చేయాలని ఈ సంవత్సరం జనవరి 28 న ప్రభుత్వం అధికారికంగా సర్కులర్ జారీ చేసినప్పటికీ స్థానికంగా ఉన్నటువంటి అధికారులు, ప్రజా నాయకులు ఈ పథకాన్ని అమలు కాకుండా లబ్ధిదారులకు అందజేయకుండా కాలయాపన చేస్తున్నారని దళిత 7బాధితులు మంది పడ్డారు. నియోజకవర్గం లో ఉన్న రెండో విడత లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టడానికి దళిత బంద్ జాయింట్ యాక్షన్ కమిటీని మంగళవారం ఎన్నుకోవడం జరిగింది. జాయింట్ కమిటీ కన్వీనర్ గా ఇంజన్ వెంకట్ స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో - కన్వీనర్లుగారేణికుంట్ల సాగర్, అంబాల ప్రభాకర్,రామంచ భరత్, అంబాల మధునయ్య,గుండ్ల గణపతి,దళిత బంధు లబ్దిదారుల ఆయా మండలాల ఇన్చార్జిలుగా, కో కన్వీనర్లు మహంకాళి రమేష్ - వీణవంక, మోరె శేఖర్ - జమ్మికుంట, రామంచ రాకేష్ ఇల్లందకుంట, కోడెపాక రక్షిత్ - జమ్మికుంట,గాజుల కుమార్ - వీణవంక బోగం మురళి - ఇల్లందకుంట,గంగారపు ప్రవీణ్ - జమ్మికుంట , అంబాల శంతన్ - హుజురాబాద్. తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు స్పెషల్ ఆఫీసర్ రఘురామకృష్ణకి బిఆర్ఎస్ పార్టీ నెల్లుట్ల గ్రామ శాఖ ఆధ్వర్యంలో వినతి

తొలిఅడుగు, జనగామ, మే 06 : నెల్లుట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు స్పెషల్ ఆఫీసర్ రఘురామకృష్ణ కి సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి కి బిఆర్ఎస్ పార్టీ నెల్లుట్ల గ్రామ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది నెల్లుట్ల గ్రామానికి మంజూరుయన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన నిరుపేదలను ఎంపిక చేయాల్సిందిగా ఎంపికలో రాజకీయాలకతీతంగా ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి మంజూరు చేయవలసిందిగా మనవి చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో నెల్లుట్ల గ్రామ శాఖ అధ్యక్షులు నల్ల రాహుల్



మాజీ వార్డ్ సభ్యులు జెగ్గం అశోక్ చిటూర్ అమృత్ దామర లక్ష్మణ్ దామర కరుణాకర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు

తొలిఅడుగు, హుజురాబాద్, మే 06 : తెలంగాణ రాష్ట్ర బలహీనవర్గాల మరియు రోడ్డు రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ కు జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు మంగళవారం రోజున ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు మాట్లాడుతూ భారత రాష్ట్ర సమితి 9 సంవత్సరాల పరిపాలనలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధికి నోచుకోలేదని గతంలో ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు పెద్ద ఎత్తున సమ్మె నిర్వహించారని ప్రైవేట్ డ్రైవర్ల మరియు కండక్టర్లను పెట్టి నడిపించినప్పటికీ ప్రైవేట్ డ్రైవర్లకు డ్రైవింగ్ సరిగ్గా రాక చాలా బస్సులు యాక్సిడెంట్ గురైనయని చాలామంది చనిపోయారని అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు సమ్మె నడిపిస్తున్న కాలంలో డ్రైవర్స్ కండక్టర్, మరియు ఆర్టీసీ ఆల్ యూనియన్ నాయకులను భయభ్రాంతులకు గురిచేసి సమ్మె విరమించి మీరు డ్యూటీ లలో ఎక్కకపోతే మీ ఉద్యోగాలు తీసేస్తానని బెదిరించారు బూటకపు హామీలు ఇచ్చి వారిని మోసం చేశారు ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధి పథంలో నడుస్తుందని మహిళా సోదరీమణుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని ఖరబైన బస్సులను పక్కనపెట్టి ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులతో పాటు ఎలక్ట్రికల్ బస్సులను నూతనంగా కొనుగోలు చేయడం జరిగింది తమ సంక్షేమం కోసం గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాక తమ ఇబ్బందుల పాలవుతున్నామని తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ అన్ని సంఘాల నాయకులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే సానుకూలంగా స్పందించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న అన్ని యూనియన్ ల నాయకులతో మంగళవారం రోజున డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమావేశం నిర్వహించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని మీరు అధర్యపడవద్దని తను ఆర్టీసీ అభివృద్ధి కోసం రవాణా శాఖ మంత్రిగా 24/7 పనిచేస్తున్నానని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్టీసీ అభివృద్ధి పథంలో నడుస్తుందని సమ్మె చేస్తే ఇబ్బంది అవుతుందని తెలుపగా సమ్మె చేయబోమని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అన్ని యూనియన్ ల నాయకులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ కు తెలిపారు.



# సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మణుగూరు ఎస్ఓ టు జియం కు నోటీసు అందజేత.



తొలిఅడుగు, మణుగూరు, మే 06 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం మణుగూరు ఎస్ఓ టు జియం కి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఆర్. మధుసూదన్ రెడ్డి, జి. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె లో జాతీయ కార్మిక సంఘాలతో పాటు రాష్ట్ర కార్మిక సంఘాలు కూడా పాల్గొంటున్నాయని, ఈ సమ్మె పది డిమాండ్లతో జరుగుతుందని, కనీస వేతనం 26,000 చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనాలు పెంచాలని ఇంకా తదితర డిమాండ్లతో ఈ సమ్మె జరుగుతుందని అన్నారు. సింగరేణిలో కూడా కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచక 8 సంవత్సరాల అయిందని, మేడే సందర్భంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేస్తారని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఎంతో ఆశతో ఎదురు చూశారని, కానీ రేవంత్ రెడ్డి మే డే ప్రసంగంలో వేతనాల పెంపు ప్రకటన లేకపోవడంతో నిరాశ చెందారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సింగరేణి కాంటాక్ట్ కార్మికుల వేతనాలు పెంచకపోవడంతో ఆగ్రహం చెందిన కార్మిక వర్గం కాంగ్రెస్ ఇచ్చిన హామీతో సింగరేణి వ్యాప్తంగా సింగరేణి కాంటాక్ట్ కార్మిక వర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించడంలో కీలకపాత్ర పోషించారు అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక వర్గం పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వి. జానయ్య, ఎస్. సాంబశివరావు, ఎన్. నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నివాళులు అర్పించిన గజ్వేల్ ఎన్ఎమ్ఆర్ నాయకులు...




తొలిఅడుగు, గజ్వేల్, ములుగు మే 06 : పటాన్చెరు ఎన్ఎమ్ఆర్ క్యాంపాఫీస్ లో నీలం మధు ముదిరాజ్ అమ్మా-నాన్న గార్ల వర్ధంతి సందర్భంగా నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో వారికి గజ్వేల్ ఎన్ఎమ్ఆర్ యువసేన నాయకులు కాశబోయిన శేఖర్ ముదిరాజ్ నివాళులు అర్పించారు. నీలం రాధమ్మ-నిర్మల్ ముదిరాజ్ గార్ల ఆశయాలను కొనసాగిస్తామని నీలం మధు అన్న ఒక గొప్ప స్థానంలో ఉండే వరకు పోరాటం చేస్తానని వారు తెలిపారు. నీలం మధు అన్నలాంటి ఒక గొప్ప నాయకుడిని మాకు మీరు ఇచ్చినందుకు మేము గర్వంగా చెప్పుకుంటున్నాం మీరు మా మధ్యలో లేకున్నా మేము మరియు ప్రజలు ఎల్లప్పుడూ మధుతో ఉంటామని మేము మాట ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ సుంకరబోయిన మహేష్ ముదిరాజ్, ములుగు మండల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జోగిని రవి ముదిరాజ్, మాణిక్యారావు పటేల్, రంజిత్ ముదిరాజ్, దేవ ముదిరాజ్, మధు ముదిరాజ్, శ్రీను ముదిరాజ్ లు పాల్గొన్నారు.

# పాకిస్థాన్ జాతీయులను దేశం నుంచి బహిష్కరణ చేయాలి




తొలిఅడుగు, హుజురాబాద్, మే 06 : పాకిస్థాన్ జాతీయులను దేశం నుంచి బహిష్కరణ చేయాలని బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు స్థానిక ఎమ్మార్వో వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కొలకాని రాజు, ఆకుల రాజేందర్ మాట్లాడుతూ... కాశ్మీర్ పాహల్గామ్ లో ఏప్రిల్ 22 రోజున పాకిస్థాన్ ఐఎస్ఐ శిక్షణ పొందిన మతోన్మాద ఉగ్రవాదులు భారతీయులపై ముఖ్యంగా హిందువుల పై కాల్పులు జరిపి 26 మంది అమాయకులను చంపిన చర్యను యావత్ భారత దేశం ముక్తకంఠంతో ఖండించిందన్నారు. ప్రపంచ దేశాలు కూడా ఈ చర్యను ఖండించాయని, అలాగే పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడితే భారత్ యుద్ధం ప్రకటిస్తే అమెరికా , జపాన్, ఇజ్రాయెల్ మెజారిటీ దేశాలు పాకిస్థాన్ నీ ప్రపంచ పటంలో లేకుండా చేస్తామని బహిరంగంగా మద్దతు ప్రకటించాయన్నారు. కానీ ఇక్కడున్న రాష్ట్ర ప్రభుత్వాలు బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు పాక్ జాతీయులను గుర్తించడంలో మీనమేషాలు లెక్కించడం శోచనీయం అని, ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పాక్ జాతీయులను అన్ని జిల్లాల్లో దేశం నుంచి తరిమి కొట్టాలని అన్ని రాష్ట్రాలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం, కేంద్ర హోంశాఖ ఏప్రిల్ 25న ఇచ్చిన ఆదేశాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకుని పాకిస్థాన్, బంగ్లాదేశ్ ఇతర దేశాల జాతీయులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారిని వారి దేశాలకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈకార్యక్రమంలో జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, కైలాసకొటి గణేష్, రాజేష్ ఠాకూర్, గండ్ల సంపత్, మోతె స్వామి, ఎదులాపురం అశోక్, ఇటుకాల స్వరూప, బచ్చు శివన్న, పల్లపు రవి, మోడం రాజు, రాకేష్ ఠాకూర్, రాము, కనుమల్ల లక్ష్మి, కేస స్వరూప, పొనగంటి రవి, ఉడుగుల మహేందర్, గంగాభవాని, కొండ్ర సులోచన, అప్పాల రవిందర్, ముకుందా సుధాకర్, కొండపర్తి ప్రవీణ్, రాచపల్లి ప్రశాంత్, శ్రీవర్తి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నూతన మండల అధ్యక్షుడిగా తిరుపతి రెడ్డి...



తొలిఅడుగు, గజ్వేల్, మే 06 : బీజేపీ వర్గల్ మండల నూతన అధ్యక్షుడుగా బొల్లిపల్లి తిరుపతి రెడ్డిని నియమిస్తూ జిల్లా అధిష్టానం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆదేశానుసారం సిద్దిపేట జిల్లాలో 14 మండలాలకు నూతన అధ్యక్షులను పార్టీ అధిష్టానం ప్రకటించడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ఆధ్వర్యంలో నూతన అధ్యక్షులుగా ఎన్నికైన వర్గల్ మండల బిజెపి అధ్యక్షుడు తిరుపతిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి అధ్యక్ష పదవిని ప్రకటించినందుకు జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. వర్గల్ మండల కేంద్రంలో బిజెపి మరింత బలపడేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్, ఐటీ సెల్ నాయకులు వెంకటరమణ, నేతలు సింగం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వైద్యశాలల్లో మందుల కొరత నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి, పిల్లల స్పెషలిస్ట్ లను నియమించాలి

- కొత్తగూడెంలో సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ కి వినతి పత్రం అందజేసిన సామాజిక సేవకులు కర్నే బాబురావు
- సీఎం ఓ సానుకూల స్పందన పట్ల హర్షం



తొలిఅడుగు, మణుగూరు, మే 06 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం సింగరేణి వైద్యశాలల్లో మందుల కొరత నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి, పిల్లల స్పెషలిస్ట్ లను నియమించాలనీ కోరుతూ కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎమ్ఓ) డాక్టర్ రామాపోగు కిరణ్ రాజ్ కుమార్ కి మంగళవారం ఉదయం ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు మణుగూరుకు చెందిన సామాజిక సేవకులు కర్నే బాబురావు విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వైద్యశాలలో మందుల కొరతకు సంబంధించి వార్తలు వస్తున్నాయనీ నూతన డైరెక్టర్లు మరియు చీఫ్ మెడికల్ ఆఫీసర్ గా కొత్తవారు నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టడం మందుల కొరత నివారణకు మందుల కొనుగోలుకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవటంలో జాప్యం జరుగు తోందని ఫలితంగా సింగరేణి వైద్యశాలలో మరో పది,పదిహేను రోజులలో మందుల కొరత రానున్నదని కార్మికుల్లో ప్రచారం జరుగుతోందని ఇది నిజమని నమ్మే విధంగా దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి సింగరేణి ఆసుపత్రి ఫార్మసీ లో వైద్యులు రాసిన విధంగా నెల రోజులకు కోటా ఇవ్వవలసి ఉండగా పదిహేను రోజులకు మాత్రమే ఇస్తున్నారనీ. ఇదే విటమి ప్రశ్నిస్తే మందుల కొరత ఉన్నదని సమాధానం చెబుతున్నారనీ దయచేసి సింగరేణి ఉద్యోగుల సంక్షేమం మరియు వైద్య సేవలకు సంబంధించి మందుల కొరత నివారణకు సత్వరమే తగు చర్యలు చేపట్టాలని కోరినట్లు ఆయన తెలిపారు అదేవిధంగా సింగరేణిలో పిల్లల స్పెషలిస్టుల కొరత ఉందని నవతరం ఉద్యోగులు నియామక నేపథ్యంలో పిల్లల స్పెషలిస్టులను వెంటనే నియమించాలని కోరగా సీఎంఓ కూడా సానుకూలంగా స్పందించారని అంత పెద్ద అధికారి అయ్యుండి ఎదుటివారి చెప్పేది ముందు వినటం వారు సంతృప్తి చెందే విధంగా సమాధానం ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు అదేవిధంగా సీఎంఓగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకి శుభాకాంక్షలు తెలిపానని వారి హయాంలో సింగరేణి ఉద్యోగులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యం అందుతుందని ఆయన ఆకాంక్షించారు.